www.dainamicnews.com

శుభోదయం

# డైనమిక్

ప్రజల కోసం - ప్రగతి కోసం

dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.



డైనమిక్

CELL : 96523 03089

తెలంగాణా- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | సోమవారం 5 అక్టోబర్ 2026 | వెల : 4/-

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో
# వేగం పెంచాలి



- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో షియర్‌జోన్ దాటిన తవ్వకాలు
- 2028 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు జరుగుతున్నాయి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.
- ప్రధాన టన్నెల్‌లో ఇప్పటి వరకు 79 శాతం పనులు పూర్తి
- ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు.

హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రమాదకరమైన షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గత ఐదు నుంచి ఆరు నెలల్లో సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఎస్?ఎల్?బీసీ పనులపై అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. - మిగతా3లో



## అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారింది

- చైనా ఎదుగుదలతో ప్రపంచంలో కొత్త పోటీ
- అమెరికా, చైనాపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- తన విధానాల్లో మార్పు చేసుకొని అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారిందని స్పష్టం
- అమెరికా- చైనా పోటీతో పరిస్థితులు మారిపోయాయన్న కేంద్ర మంత్రి
- అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త అవకాశాలు

## గవర్నర్ కోటాపై
# కాంగ్రెస్ నజర్

- ఎమ్మెల్సీ రేసులో ఉన్నది వీరేనట..!
- తెలంగాణలో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ
- ఆశావహులు పార్టీ పెద్దలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ నేతలను కలుస్తున్నట్లు ప్రచారం
- ఈసారి సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తుండగా, రెండు స్థానాలను బీసీలకు కేటాయించే అంశంపై చర్చ
- పద్మశాలి, ముదిరాజు సామాజికవర్గాల నేతల పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి.



హైదరాబాద్

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ అంశం కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికరంగా మారింది. మూడు స్థానాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడకముందే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎమ్మెల్సీ పదవుల కోసం పార్టీ ముఖ్య నేతలతో పాటు ఢిల్లీ స్థాయిలోనూ లాబీయింగ్ మొదలైనట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పలువురు నేతలు ఇప్పటికే.. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరినట్లు ప్రచారం.. అంతేకాకుండా.. పీసీసీ అధ్యక్షుడితో కూడా సమావేశం అవుతున్నారని పేర్కొంటున్నారు. అయితే.. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆశావహులు తమకు అవకాశం దక్కేలా పార్టీ పెద్దలను కలుస్తున్నట్లు సమాచారం

ఈసారి ఎమ్మెల్సీ ఎంపికలో సామాజికవర్గాల సమీకరణలు కీలకంగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి - మిగతా3లో



## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి
# చంద్రబాబుకు పంపిస్తున్నాడు

- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు





## శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

- శిలాతోరణం వరకు బారులు తీరిన క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల అధిక రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు
- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని అంచనా
- శనివారం శ్రీవారిని 91,296 మంది దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.5.06 కోట్ల ఆదాయం

## అమల్లోకి కొత్త
# మున్సిపల్ చట్టం

- ఇకపై సేవలు మరింత సులభం!
- హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది.
- ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 70 ఏళ్ల నాటి జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కోర్ అర్బన్ రీజియన్ చట్టం--2026 తీసుకొచ్చింది.
- అక్టోబర్ 2 నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది





హైదరాబాద్

హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. మున్సిపల్ శాఖను స్వయంగా చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నగర పాలనపై నేరుగా పర్యవేక్షణ సాగించేలా కొత్త వ్యవస్థలో కీలక మార్పులు చేశారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ పనిచేస్తుంది. నగరాభివృద్ధి ప్రాధాన్యాలను ఈ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. కార్పొరేషన్లు, పోలీస్, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్, మెట్రో, ఆర్టీసీ, హైడ్రా అధికారులు ఒకే వేదికపై చర్చించి నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కొత్త చట్టంలోకి వచ్చింది. 1955లో పాత మున్సిపల్ చట్టం వచ్చినప్పుడు హైదరాబాద్ జనాభా సుమారు 15 లక్షలు. ఇప్పుడు కోర్ అర్బన్ రీజియన్‌లో దాదాపు 1.3 కోట్ల మంది నివసిస్తున్నారు. నగరం భారీగా విస్తరించింది. వరదలు, ఎండ తీవ్రత, వాయు కాలుష్యం, నీటి కొరత, ట్రాఫిక్, చెరువులు--నాలాల ఆక్రమణలు, ఎత్తైన - మిగతా3లో



## కొత్త జాబ్ కార్డుల జారీకి
# లైన్ క్లియర్

- గ్రామీణులకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఉపాధి హామీ పథకం కింద కొత్త జాబ్ కార్డుల జారీకి ఆమోదం
- కరువు పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డుల విడుదలకు సిద్ధమైంది

హైదరాబాద్

తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎల్‌నివో పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌నివో ప్రభావంతో గతంతో పోలిస్తే సాధారణ వర్షపాతం భారీగా పడిపోయింది. - మిగతా3లో



## ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

- ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
- సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
- దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

# 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం: మునగాలలో రూ. 9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్

**అక్టోబర్ 6న శంకుస్థాపన చేయనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్**

సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల--మాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**సింగరేణి విరాళంతో ప్రాజెక్టు**

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.



**1,029 విద్యాసంస్థలకు ఆహార సరఫరా**

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. జిల్లాలోని సుమారు 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తయారు చేసి సరఫరా చేయడం కమ్యూనిటీ కిచెన్ ప్రధాన ఉద్దేశం. అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన కొన్ని జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించే అంశాన్ని కూడా ప్రణాళికలో చేర్చారు.

**నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం**

వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థులకు పాఠశాల వేళల్లో పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, సంక్షేమానికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

**పనులపై మంత్రి పర్యవేక్షణ**

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యాసంస్థలకు సరఫరా వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించనున్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సంబంధిత అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ వంటశాల ద్వారా సూర్యాపేట జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందనుంది.

# చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్ సాధించుకుంటాం

ఇది మా హక్కు- ఎవరి దయాదాక్షిన్యాలు మాకొద్దు

బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు స్పష్టీకరణ

ట్టసభల్లో బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్ సాధించి తీరతామని ఇది మా హక్కు అని ఎవరి దయాదాక్షిన్యాలు మాకు అవసరం లేదని పోరాడి సాధించుకుంటామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిధూళిపాళ ధనుంజయ నాయుడు స్పష్టం చేశారు

ఆదివారం నారాయణగూడ సత్యనారాయణ రెడ్డి భవన్ లో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి హైదరాబాదు జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ....

ఇవాళ దేశవ్యాప్తంగా జరుగుతున్న అస్తిత్వ ఉద్యమాలు విజయవంతం అయ్యి తీరుతాయి అని, ప్రజా ఉద్యమాలు ఏనాడు కూడా విఫలం చెందలేదనేది చరిత్ర చెబుతున్న సత్యం అని, బీసీలవి గొంతెమ్మ కోరికలు కావని 10% కూడా జనాభా లేని అగ్రవర్ణాల వారికి ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే బీసీలుగా మేము ఏనాడు ప్రశ్నించలేదని అదే దామాషాలో 56% ఉన్న బీసీలకు విద్య వైద్య ఉపాధి మరియు రాజకీయ రంగంలో రిజర్వేషన్ కల్పించి స్వాతంత్ర ఫలాలు అందరికీ దక్కేలా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉన్నదని గుర్తు చేస్తున్నామని అన్నారు

**ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ**

స్వాతంత్రశీ వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తి కావస్తున్నా నేటికీ ఈ దేశంలో అత్యంత వివక్షత గురవుతున్నది ఒక్క బీసీలు మాత్రమే బీసీల పట్ల పాలకులకు ఎందుకింత వివక్షత అని, స్వాతంత్ర ఫలాలు అందరికీ దక్కాలంటే రాజకీయ రిజర్వేషన్ తప్పనిసరి అని ఇవాళ అధికారంలో ఉన్న పాలకులు ఎవరైనా సరే బీసీలను విస్మరించే స్థితిలో లేరని అందుకు కారణం బీసీల్లో ఎంతో కొంత చైతన్యం రావడమేనని ఇది హర్షించదగ్గ పరిణామం అని కానీ ఈ చైతన్యం సరిపోదని మరింత పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు నిర్మించడం ద్వారా బీసీలు తమ హక్కులను సాధించుకోవచ్చని ఆ దిశగా బీసీ హక్కుల సాధన సమితి తీవ్రంగా కృషి చేస్తుందని ఆయన తెలిపారు




మహాసభకు బాలయ్య యాదవ్ అధ్యక్షత వహించగా.. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ గీతా పనివాళ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ గౌడ్. చీ = శ్రీనివాసరావు సీ శంకర్ గౌడ్ రవీందర్ పాల్గొన్నారు

# గవర్నర్ కోటాపై కాంగ్రెస్ నేతల నజర్

-మొదటిపేజీ తరువాయి

సామాజికవర్గానికి కేటాయించిన నేపథ్యంలో.. గవర్నర్ కోటాలో బీసీ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది

**రెండు స్థానాలు బీసీలకు**

మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీ సామాజికవర్గాలకు కేటాయించే అంశంపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీకి రాజకీయంగా ఉపయోగపడే నేతలను ఎంపిక చేయాలనే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

**పద్మశాలి కోటాపై సిరిసిల్ల సభలోనే హామీ**

పద్మశాలి సామాజికవర్గానికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించే అంశంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభలో కీలక ప్రకటన చేసిన విషయం చర్చనీయాంశంగా మారింది. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని పెద్దల సభకు పంపుతామని సిరిసిల్ల సభ వేదికగా సీఎం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి ఆ సామాజికవర్గానికి దక్కే అవకాశం ఉందనే చర్చ కాంగ్రెస్‌లో మొదలైంది. పద్మశాలి కోటాలో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, పున్న కైలాష్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సీఎం హామీ నేపథ్యంలో ఈ ఇద్దరి పేర్లపై పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది

**ముదిరాజు కోటాలో ఎమ్మెల్సీ పదవి..**

మరో ఎమ్మెల్సీ స్థానాన్ని ముదిరాజు సామాజికవర్గానికి కేటాయించే అంశాన్ని కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ముదిరాజు సామాజికవర్గం గణనీయమైన జనాభాను కలిగి ఉండటంతో ఆ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచన పార్టీలో ఉన్నట్లు తెలుస్తోంది.

ముదిరాజు కోటాలో మెదక్ ఎంపీ అభ్యర్థి గా పోటీ చేసిన నీలం మధు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ ముఖ్య నేతలను కలిసి ఎమ్మెల్సీ అవకాశం కోసం తన ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే ఎంపీ ఎన్నికల తర్వాత నీలం మధుకు సీఎం హామీ ఇచ్చినట్లుగా



తెలుస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి పెద్దపీఠ వేయాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇది కనుక వర్కౌట్ అవుతుందా లేదా చూడాల్సి ఉంది.

**బీసీ కోటాలో పలువురి పేర్లు**

బీసీ కోటాలో ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. చనగాని దయాకర్, సత్తు మల్లేశ్, కౌశిక్ యాదవ్ పేర్లు కూడా పార్టీలో చర్చకు వస్తున్నట్లు సమాచారం..

**మూడో సీటుపై ఆసక్తికర సమీకరణం..**

మూడు స్థానాల్లో మూడో సీటును రెడ్డి సామాజికవర్గానికి కేటాయించే పరిస్థితి వస్తే ఆర్టీఐ కమిషనర్ అయోధ్యారెడ్డి పేరు కూడా రేసులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మొత్తంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తోంది. సామాజికవర్గాల ప్రాతినిధ్యం, పార్టీ విధేయత, రాజకీయ సమీకరణాలు.. ఈ అంశాల ఆధారంగా తుది ఎంపిక ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆశావహుల జాబితాపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ కొనసాగుతోంది.

## శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రీవారి దర్శనార్థం వచ్చిన యాత్రికులతో కొండపై రద్దీ వాతావరణం నెలకొంది. ఇవాళ వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి వచ్చి సుమారు కిలోమీటరు దూరంలోని శిలాతోరణం వరకు చేరాయి. ప్రస్తుతం స్వామివారి సర్వదర్శనానికి (టైంస్లాట్ టోకెన్లు లేనివారికి) సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిన్న శనివారం (అక్టోబర్ 3) ఒక్కరోజే 91,296 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 32,805 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.06 కోట్లుగా నమోదైంది. టీటీడీ అధికారులు 4.67 లక్షల లడ్డూలను విక్రయించారు. అలాగే, సుమారు 3.19 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. రద్దీ కారణంగా భక్తుల సౌకర్యార్థం టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లలో ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. వైద్య సేవలు అవసరమైన వారి కోసం అశ్విని ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం నాడు 4,516 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. భక్తులు సంయమనం పాటిస్తూ టీటీడీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై భీకర దాడి జరిగింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు సుమీ నగరంలోని 'కుసుమ్ గ్రూప్'కు చెందిన ఫార్మా ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ దాడిలో ప్లాంట్‌లోని ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. డ్రోన్లు దాడి చేసిన ప్రాంతం నుంచి భారీగా పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడి వల్ల సుమారు రూ.400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. విశేషమేమిటంటే.. రెండేళ్లకు పైగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, ఈ ప్లాంట్ నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడితో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. భారతీయుడైన రాజీవ్ గుప్తా నేతృత్వంలో కుసుమ్ గ్రూప్ నడుస్తోంది. ఈ సంస్థ 1994లో భారతీయ ఔషధాలను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమై, ఆ తర్వాత సొంత బ్రాండ్లను మార్కెటింగ్ చేసింది. 2009లో సుమీ నగరంలో తయారీ ప్లాంట్‌ను స్థాపించింది. ఈ గ్రూప్ ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వంటి 9కి పైగా దేశాలకు 50 రకాల జనరిక్ ఔషధాలను విక్రయిస్తోంది. గత కొంతకాలంగా రష్యా.. చవకైన, వేగవంతమైన షాహెద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై నిరంతరం దాడులు చేస్తోంది. ఈ డ్రోన్లను అడ్డుకోవడం ఉక్రెయిన్ వాయు రక్షణ వ్యవస్థలకు సవాలుగా మారింది. ఇదే సమయంలో, ఉక్రెయిన్ కూడా దేశీయంగా తయారుచేసిన 'ఎఫ్‌పీ-7' బాలిస్టిక్ క్షిపణిని ఈ వారంలో తొలిసారిగా ప్రయోగించినట్లు ప్రకటించింది. దీని పరిధి సుమారు 250 కిలోమీటర్లు కావడం గమనార్హం.

## అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారింది

ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా మారుతున్న తీరు, చైనా ఎదుగుదలే అంతర్జాతీయ స్థితిగతులను ప్రభావితం చేస్తున్న రెండు ప్రధాన అంశాలు అని స్పష్టం చేశారు. ఈ మేరకు జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్‌లో విదేశాంగ మంత్రి విశ్లేషించారు. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తున్న మొదటి మార్పు అమెరికా తన స్థానాన్ని, వ్యూహాన్ని మార్చుకోవడమే. ఆ దేశం ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అది స్వచ్ఛందంగా, కావాలనే ఒక ఒంటరి శక్తిగా మారుతోందని వ్యాఖ్యానించారు. ఇక్కడ అమెరికా విషయంలో రాడికల్ రీపొజిషనింగ్ అనే పదం ఉపయోగించారు. రాడికల్ రీపొజిషనింగ్ అంటే ఏదైనా సంస్థ లేదా దేశం తన పాత ఇమేజ్, వ్యూహాలను పూర్తిగా మార్చేసి కొత్త విధానాన్ని ఎంచుకోవడం. ఇక్కడ అమెరికా విషయంలో తన పాత విదేశాంగ విధానాలను, వ్యూహాల్ని పూర్తిగా మార్చుకుంటోందని జైశంకర్ స్పష్టం చేశారు. ఇది పరిస్థితుల వల్లే వచ్చిన మార్పు కాదని, విధానపరంగా తీసుకున్న నిర్ణయం అని చెప్పుకొచ్చారు. ప్రతి విషయంలోనూ తానే ప్రపంచానికి పెద్దన్నలా ఉంటూ అందరికీ సాయం చేసే పాత పద్ధతిని పక్కనబెట్టి తన ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణివైపు అమెరికా మారిందనే అర్థం వచ్చేలా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఇక రెండో అంశం చైనా గురించి. చైనా తనను తాను అంతర్జాతీయంగా ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన శక్తిగా భావిస్తోందని జైశంకర్ వ్యాఖ్యానించారు. చైనా ఎదుగుదల అంతర్జాతీయ వ్యవస్థను మరింత ప్రభావితం చేస్తోందన్నారు. చైనా ఆర్థిక, రాజకీయ సామర్థ్యాలు కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే అమెరికా- చైనా మధ్య ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొందని జైశంకర్ పేర్కొన్నారు. అయితే ప్రపంచంలో పోటీ కేవలం రెండు అగ్రదేశాలకే పరిమితం కాలేదని, ఈ కారణంగానే ప్రతి దేశం తమ వద్ద ఉన్న శక్తులు లేదా అవకాశాల్ని ఆయుధంగా మలుచుకునే ప్రమాదకర పరిస్థితులకు దారితీసిందని హెచ్చరించారు. ఇలా దీనిని ఇతరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపయోగించుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు దేశాల మధ్య పరస్పర ప్రయోజనాల కోసం సంబంధాలు కొనసాగుతున్నా, మరోవైపు అవసరమైన చోట తమ బలాలనే అస్త్రాలు ప్రయోగిస్తున్నాయని జైశంకర్ తెలిపారు.

**అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త అవకాశాలు**

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్వప్రయోజనాల కోసం పలు ప్రాంతీయ కూటములను ఆశ్రయిస్తున్నాయని జైశంకర్ తెలిపారు. పెద్ద పెద్ద దేశాల వ్యవస్థల కంటే నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఏర్పడుతున్న చిన్న సమూహాలే కీలకంగా మారుతున్నాయని జైశంకర్ ఉదాహరణలతో వివరించారు. ఇందులో భారత్ భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న క్వాడ్ (ఞఖూాణ), ఇండియా మిడిల్ ఈస్ట్- యూరప్ ఎకనామిక్ కారిడార్ (×వీజుజుజ), ఇంటర్నేషనల్ నార్త్ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ (×చీూజ), ఇంటర్నేషనల్ సోలార్ అలియన్స్ (×ూూా), బ్రిక్స్ వంటి వేదికలు నిదర్శనం అని జైశంకర్ చెప్పారు. ఈ కూటముల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలు పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే కాకుండా, అవసరానికి అనుగుణంగా అమెరికా- చైనాతో కూడా సంబంధాలు కొనసాగిస్తున్నాయని వివరించారు. భవిష్యత్తులో దేశాలు ఒకే దానిపై కాకుండా, తమ ప్రయోజనాలకు అనుగుణంగా అనేక దేశాలతో సంబంధాలు కొనసాగించాల్సి ఉంటుందని చెప్పారు.

**అమెరికా- చైనా పోటీపై జైశంకర్ విశ్లేషణ**




రెండు అగ్రదేశాలు అమెరికా- చైనా మధ్య తీవ్ర పోటీ నేపథ్యంలో ప్రపంచ దేశాలు బ్యాలెన్సింగ్ వ్యూహాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని జైశంకర్ సూచించారు. అమెరికా- చైనా పోటీని ఆయన గోల్డిలాక్స్ సినారియోతో పోల్చారు. ఇక్కడ రెండు దేశాల మధ్య పరిస్థితి మరీ తీవ్రంగా ఉండకూడదని, అదే సమయంలో మరీ సన్నిహితంగా కూడా ఉండకూడదని, రెండింటి మధ్య సమతుల్యత అవసరం అని వివరించారు.

**మాటలకే పరిమితం కాలేదు- నేరుగా రంగంలోకి దిగాం**

రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ తన దౌత్య వ్యూహాన్ని మరింత వేగవంతం చేసిందని జైశంకర్ తెలిపారు. ఇన్ని రోజులు కేవలం చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించే స్థితి నుంచి ఇప్పుడు ఇరు దేశాలతో నేరుగా చర్చలు జరిపే స్థాయికి భారత్ చేరుకుందని ఆయన తెలిపారు. సంక్షోభాన్ని ముగించడమే తమ ప్రథమ లక్ష్యమని, అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. గత కొంత కాలంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా యుద్ధాన్ని ముగించాల్సిన సమయం వచ్చిందని బహిరంగంగా చెబుతూనే ఉన్నారు.

# ఆటో కార్మికుల సంక్షేమ బోర్డుకు ప్రభుత్వం సానుకూలం

ప్రజాభవన్‌లో ఆటో జేఏసీ కార్మికులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖాముఖి



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్:** ఆటో కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా జీవో నంబర్ 46 ద్వారా ఆటో కార్మికుల మీటర్ రీడింగ్ రేట్ల సవరణ చేపట్టిన అనంతరం, అక్టోబర్ 3న హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఆటో జేఏసీ కార్మికులతో ప్రత్యేకంగా ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆటో కార్మికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆటో జేఏసీ ప్రతినిధులతో కలిసి విందు భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.
ఆటో కార్మికుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆటో కార్మిక సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్, బీఆర్టీయూ ఆటో యూనియన్ అధ్యక్షులు వి. మారయ్య, ఐఎన్టీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షులు గోదా మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్. నరసింహారెడ్డి, సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, ముఖేష్ గౌడ్, సలీం తదితర జేఏసీ ఆటో కార్మిక సంఘాల నాయకులు, సుమారు 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

# యుగపురుషుడు అన్న ఎన్టీఆర్..!

కాచవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**కారంపూడి , శుభోదయ డైనమిక్** అన్ని రంగాల అభ్యున్నతికి కృషి చేసి, సామాజిక సంస్కరణలకు రాజకీయ బీజం వేసిన మహనీయుడు, యుగపురుషుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కొనియాడారు.కారంపూడి మండల పరిధిలోని కాచవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఎన్టీఆర్ ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య, మునిగోటి సత్యనారాయణ, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, షేక్ రహీమ్, షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్ శ్రీ శ్వేత హాస్పిటల్ లో అరుదైన చికిత్స

మహిళ కడుపులోంచి 10 కేజీల కణితి తొలగింపు



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్ :** హుజూర్‌నగర్ పట్టణంలోని లింగగిరి రోడ్ లో ఉన్న శ్రీ శ్వేత హాస్పిటల్ లో శనివారం డాక్టర్ శ్వేత అట్లూరి, డాక్టర్ జి సునీల్ కుమార్ లు మహిళ కడుపులో ఉన్న 10 కేజీల కణితి ని చికిత్స ద్వారా తొలగించారు. మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం కు చెందిన బానోత్ భజిని అనే 45 సంవత్సరముల వయసు గల మహిళ గత కొన్ని సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం హుజూర్‌నగర్ శ్రీ శ్వేత హాస్పిటల్ లో చేరగా డాక్టర్స్ శ్వేత అట్లూరి, డాక్టర్ జి సునీల్ కుమార్ లు బాధిత మహిళకు అన్ని పరీక్షలు నిర్వహించి కణితి ని గుర్తించి మహిళ కడుపులోంచి 10 కేజీల కణితి ని ఆపరేషన్ ద్వారా తొలగించారు. ఇంత క్లిష్ట తరమైన ఆపరేషన్ ను తక్కువ ఖర్చుతో చేసిన హాస్పటల్ యాజమాన్యానికి, డాక్టర్స్ శ్వేత అట్లూరి, డాక్టర్ జి సునీల్ కుమార్ లకు బాధిత మహిళా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# దైవిక్ మొదటి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ,శుభోదయ డైనమిక్ వార్త** కోదాడ పట్టణానికి చెందిన కాసం క్రాంతికుమార్--నవ్య దంపతుల కుమారుడు దైవిక్ మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని చిన్నారి దైవిక్‌ను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా దైవిక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళు జీవించాలని, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**కుషాయిగూడ, అక్టోబర్ 4 శుభోదయ డైనమిక్ :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగార్జున నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 29 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. బోడుప్పల్‌కు చెందిన కన్నారపు శ్రవణ్ (29) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని నాగార్జున నగర్‌లోని తన సహోద్యోగి ఇంటికి వెళ్లిన శ్రవణ్, అనంతరం ఇంటికి తిరిగి వెళుతుండగా ఆదివారం తెల్లవారుజామున సుమారు 2:35 గంటలకు తన ాావ్ఙ్ఞఋ (యా27ఖ4867)పై అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రవణ్‌ను స్థానికులు ఈసీఐఎల్‌లోని శ్రీకర హాస్పిటల్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.
మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోలీసు ఉద్యోగ ఆశావహులకు ఉచిత శిక్షణకు ఎంపిక పరీక్ష

హుజూర్‌నగర్‌లో గ్రీన్‌వుడ్ స్కూల్‌లో 182 మంది అభ్యర్థుల హాజరు




**హుజూర్‌నగర్, శుభోదయ డైనమిక్ న్యూస్** ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న 45 రోజుల ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక పరీక్ష ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించారు. హుజూర్‌నగర్‌లోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 182 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ , జిల్లా ఎస్పీ కే. నరసింహ ఐపీఎస్ ప్రత్యేక చొరవతో పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు ఈ ఎంపిక పరీక్ష నిర్వహించారు.పరీక్షా నిర్వహణను హుజూర్‌నగర్ సీఐ జి. చరమంద రాజు పర్యవేక్షించారు. హుజూర్‌నగర్, గరిడేపల్లి, మఠంపల్లి, నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది పాల్గొని పరీక్షను పర్యవేక్షించారు.

# కుషాయిగూడలో మైనర్ బాలుడు అదృశ్యం

**కుషాయిగూడ, అక్టోబర్ 04 శుభోదయ డైనమిక్ :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న 16 ఏళ్ల బాలుడు అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. సౌత్ కమలానగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్న కె. లోకేష్ అక్టోబర్ 3న అదృశ్యమైనట్లు అతని తండ్రి కలికివాయి మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 3న ఉదయం సుమారు 8.30 గంటలకు తండ్రి తన ద్విచక్ర వాహనంపై లోకేష్‌ను కళాశాల వద్ద దించి ఇంటికి వెళ్లారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో బాలుడు ఇంటికి రాకపోవడంతో కళాశాలకు వెళ్లి విచారించగా, అప్పటికే కళాశాల నుంచి వెళ్లిపోయినట్లు యాజమాన్యం తెలిపింది.
దీంతో తండ్రి బాలుడి స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో ఆరా తీసి గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి బాలుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.బాలుడి వివరాలు: కె. లోకేష్, వయస్సు 16 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5.2 అడుగులు. సాధారణ ఛాయ. అదృశ్యమైన సమయంలో పసుపు రంగు కళాశాల యూనిఫాం టీ-షర్ట్, నీలం రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలడని పోలీసులు తెలిపారు.

# గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత: ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి



**కారంపూడి,శుభోదయ డైనమిక్** గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. కారంపూడిలో సిమెంటు కాంక్రీట్ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తాం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.వర్షాకాల ఇబ్బందులకు పరిష్కారం
కొత్త సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలు సులభతరం కానున్నాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయని గ్రామస్తులు తెలిపారు.కార్యక్రమంలో పంగులూరి పూలయ్య, పంగులూరి ఆంజయ్య, మునుగోడు సత్యం, కటికల బాలకృష్ణ, మస్తాన్ జానీ, చపిడి రాము, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంకర్ బహుకరణ..!

**శుభోదయం డైనమిక్ న్యూస్ మఠంపల్లి :** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం : మఠంపల్లి మండల పరిధిలో గుండ్లపల్లి గ్రామపంచాయతీకి మేళచెరువు మై హోమ్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో మొబైల్ వాటర్ ట్యాంకర్ ను బహూకరించారు. ఈ సందర్భంగా పరిశ్రమ యూనిట్ హెడ్ ఎన్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా రూ 2,35000/లు విలువగల వాటర్ ట్యాంకర్ ను గ్రామపంచాయతీ అవసరాల నిమిత్తం సర్పంచ్ వెంకటరమణ బ్రహ్మారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ జీఎం శ్రీరామ్, సీనియర్ డిజిఎం మైన్స్ అప్పలరాజు, సిద్ధం వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ కనుకుంట్ల కొండలు, గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన సూర్యాపేట కౌన్సిలర్లు

చెంచల శ్రీనివాస్ కుటుంబానికి రూ.2,40,000 ఆర్థిక సాయం



**శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 04,** సూర్యాపేట :మానవత్వానికి రాజకీయాలు అడ్డురావని సూర్యాపేట మున్సిపల్ కౌన్సిలర్లు చాటి చెప్పారు. తోటి ప్రజాప్రతినిధి కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలవడమే తమ బాధ్యత అన్నట్లుగా పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చారు.ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ చెంచల మణిలత భర్త, మాజీ కౌన్సిలర్ చెంచల శ్రీనివాస్ కుటుంబానికి తమ ఒక నెల గౌరవ వేతనాన్ని ఆర్థిక సహాయంగా అందజేశారు.రూ.2.40 లక్షల ఆర్థిక సాయంస్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం చెంచల శ్రీనివాస్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లందరూ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
శ్రీనివాస్ కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అండగా నిలవాలని నిర్ణయించిన కౌన్సిలర్లు.. తమకు ప్రభుత్వం నుంచి అందే ఒక నెల గౌరవ వేతనాన్ని కుటుంబానికి అందజేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సేకరించిన రూ.2.40 లక్షలను కౌన్సిలర్ చెంచల మణిలత, ఆమె కుమారుడు చెంచల నిఖిల్ నాయుడుకు అందజేశారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
పార్టీలకతీతంగా ఏకతాటిపైకి రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సాధారణంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో.. పార్టీల భేదాలను పక్కనపెట్టి తోటి కౌన్సిలర్ కుటుంబానికి ప్రజాప్రతినిధులంతా అండగా నిలవడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు ప్రదర్శించిన ఐక్యత, మానవత్వం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, వైస్ చైర్మన్ మహమ్మద్ షఫీ ఉల్లా, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ నాగార్జున అంగిరేకుల తదితర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఘనంగా సీతారామచంద్రస్వామి మాస కళ్యాణం



**శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 04, సూర్యాపేట :** జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరంలోని శ్రీ సీతారామచంద్రస్వామి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా ఆదివారం మాస కల్యాణం ను దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. శాస్త్రోక్తంగా మాంగల్య దారణతో కళ్యాణ తంతు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్,భక్తులు ఈగ వెంకటేశ్వర్లు, షీలా శంకర్, సోమ సుమన్, వీరవెల్లి రామ్మూర్తి, అప్పారావు, గన్నవరపు రమణ, కొత్తూరు రాజు, కక్కిరేణి విజయ్, అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, మందిరం మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్నకోహెన్స్ లైఫ్ సెన్సెస్ సేవలు అభినందనీయం -

డీఎస్పీ ప్రసన్న కుమార్



**శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 04, సూర్యాపేట** :కోహెన్స్ లైఫ్ సెన్సెస్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు కోహెన్స్ లైఫ్ సెన్సెస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.
శిబిరంలో బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 5వ వార్డ్ కౌన్సిలర్ విజయ నాయక్, 6వ వార్డు ఎక్స్ కౌన్సిలర్ లింగ నాయక్ , శ్రీహాన్ హాస్పిటల్ డాక్టర్ గిరిధర్ రెడ్డి, విజిత రెడ్డి, అర్థో వెంకటేష్, కోహెన్స్ లైఫ్ సెన్సెస్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దసరా, బతుకమ్మ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసుల సూచనలు తప్పక పాటించాలి: ఎస్పీ నరసింహ**



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** దసరా, బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ సూచించారు. పండుగల సందర్భంగా ప్రజలు, యువత, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించి భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు.గొడవలకు తావులేకుండా ఉత్సవాలు ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ ఎలాంటి ఘర్షణలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేయకుండా, తక్కువ శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్ మాత్రమే వినియోగించాలని సూచించారు. అనుమతి లేని లక్కీ డ్రాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు రోడ్లపై ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.మండపాల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరి దుర్గామాత మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు సురక్షిత విద్యుత్ వైరింగ్, నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేసి కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని తెలిపారు.బతుకమ్మ వేడుకల్లో మహిళలకు భద్రత బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలకు తగిన సౌకర్యాలు, భద్రత కల్పించాలని సూచించారు. సంప్రదాయ పూలతోనే బతుకమ్మలను తయారు చేయాలని, రసాయనాలు కలిపిన పూలను నీటిలో వేయకుండా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు తప్పక పాటించాలన్నారు.నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి వర్షాభావ పరిస్థితులు, నీటి వనరులపై ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని నీరు, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఎస్పీ సూచించారు. పండుగల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.పండుగ మనందరిది -- ఆనందం, ఐక్యత, భద్రత మన బాధ్యత" అనే సందేశంతో దసరా, బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులకు ప్రజలు, యువత, ఉత్సవ కమిటీలు సహకరించాలని ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ కోరారు.

# పోలీసు ఉద్యోగ ఆశావహులకు ఉచిత శిక్షణ ఎంపిక పరీక్ష

**సూర్యాపేట జిల్లాలో 4 కేంద్రాల్లో పరీక్ష.. 1,220 మంది యువత హాజరు**

**ఎస్వీ డిగ్రీ కళాశాలలో పరీక్షా సరళిని పరిశీలించిన ఎస్పీ కె. నరసింహ**

**సూర్యాపేట బ్యూరో , శుభోదయ డైనమిక్**




ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న 45 రోజుల ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక పరీక్ష ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 1,220 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

**నాలుగు కేంద్రాల్లో ఎంపిక పరీక్ష**

సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల, కోదాడ కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల, హుజూర్‌నగర్ గ్రీన్‌వుడ్ పాఠశాల, తిరుమలగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముందస్తు రిజిస్ట్రేషన్ ద్వారా 1,600 మందికి పైగా అభ్యర్థులు నమోదు చేసుకున్నారు.

**పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ**

సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఐఏఎస్ ప్రత్యేక చొరవతో జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 45 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకే ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత సమయాన్ని వృథా చేయకుండా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని పోలీసు ఉద్యోగాలతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.

**అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు**

ఎస్పీ వెంట అదనపు కలెక్టర్ ట్రైనీ ఐఏఎస్ అనుషా, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు, డిప్యూటీ ఎమ్మార్వో, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



# జర్నలిస్టులు, అడ్వకేట్లపై పోలీసుల వరుస విజయం..!



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్:** గంజాయి నిర్మూలనకు మద్దతుగా నిర్వహించిన ఫ్రెండ్లీ క్రీడా పోటీల్లో పోలీసులు సత్తా చాటారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అడ్వకేట్లు, పోలీసుల మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రీడా పోటీల్లో జర్నలిస్టుల జట్టుపై, అనంతరం అడ్వకేట్ల జట్టుపై పోలీసులు విజయం సాధించి వరుసగా రెండు విజయాలను నమోదు చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో జర్నలిస్టులు--పోలీసుల జట్లు తలపడగా పోలీసుల జట్టు విజయం సాధించింది. అనంతరం అడ్వకేట్లు--పోలీసుల మధ్య జరిగిన మ్యాచ్‌లోనూ పోలీసులు గెలుపొందారు. దీంతో రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి పోలీసులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు మాట్లాడుతూ.. క్రీడలతో వివిధ వర్గాల మధ్య స్నేహభావం, ఐక్యత పెంపొందుతాయని అన్నారు. క్రీడా పోటీలు క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు పరస్పర స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాగా, ఫ్రెండ్లీ క్రీడా పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని సీఐ చరమంద రాజు శనివారం ఆవిష్కరించారు. జర్నలిస్టులు, అడ్వకేట్లు పెద్ద సంఖ్యలో పేర్లు నమోదు చేసుకొని క్రీడా పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎస్ఐ నరేష్, టోర్నమెంట్ కన్వీనర్ మోర్తాల నాగిరెడ్డి, జర్నలిస్టులు కోలా నాగేశ్వరరావు, దుగ్గి ఉషశ్రీ, దొంతగాని రాజా రమేష్, షేక్ జానీ పాషా, నక్క నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

# నేరేడుచర్ల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలి

**భూగర్భ జలాల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**




నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్ నేరేడుచర్ల పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు కోరారు. వర్షపాతం తగ్గడం, ఎండల తీవ్రత పెరగడం వంటి పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**అవసరం మేరకే తాగునీటి వినియోగం**

మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. ప్రతి ఇంటి నల్లాకు తప్పనిసరిగా ట్యాపులు బిగించుకోవాలని, నీటిని వృథాగా రోడ్లపైకి, కాలువల్లోకి వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**నీటి వృథాపై కఠిన చర్యలు**

ఇష్టానుసారంగా నీటిని వృథా చేస్తే భవిష్యత్‌లో మున్సిపాలిటీ తరపున కఠినమైన ఆంక్షలు, చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.పట్టణ ప్రజలు నీటి సంరక్షణలో మున్సిపల్ యంత్రాంగానికి సహకరించడంతో పాటు ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి నీటి బొట్టును కాపాడితేనే భావితరాలకు నీటి భద్రత కల్పించగలమని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ప్రతి కుటుంబం స్మార్ట్ రేషన్ కార్డు సద్వినియోగం చేసుకోవాలి**

**నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్ వార్త** మునగాల గ్రామపంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకట్ రెడ్డి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు అందించి, పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు మరింత పారదర్శకంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రహీమ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పెదపంగ ప్రవీణ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, నేరేడుచర్ల మున్సిపల్ కౌన్సిలర్ కలీం భాయ్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కెమెరామెన్ ఆర్ కె కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ మీటర్లు బయటకు స్పష్టంగా కనిపించేలా ఉంచాలి

**వినియోగదారులకు ఏఈ ఓగూరి రమణయ్య విజ్ఞప్తి**



**కారంపూడి, శుభోదయ డైనమిక్ వార్త** కారంపూడి మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లలోని విద్యుత్ మీటర్లను బయటకు స్పష్టంగా కనిపించేలా, మీటర్ రీడింగ్ సిబ్బందికి సులభంగా అందుబాటులో ఉండే విధంగా ఉంచాలని ఏఈ ఓగూరి రమణయ్య సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.మీటర్ రీడింగ్ సిబ్బందికి వినియోగదారులు సహకరించడం ద్వారా విద్యుత్ వినియోగానికి అనుగుణంగా సక్రమమైన రీడింగ్ నమోదు అవుతుందని పేర్కొన్నారు. తద్వారా రీడింగ్‌లో పొరపాట్లు, అధిక బిల్లులు వచ్చే సమస్యలను నివారించవచ్చున్నారు. అదేవిధంగా విద్యుత్ మీటర్లు సిబ్బందికి సులభంగా కనిపించేలా ఉండటం వల్ల వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలు అందించడం మరింత సులభమవుతుందని ఏఈ తెలిపారు. ప్రతి వినియోగదారుడు విద్యుత్ శాఖ సిబ్బందికి, మీటర్ రీడర్లకు సహకరించాలని ఆయన కోరారు.

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA